www.netifocusnews.com
నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక
తెలంగాణ జిల్లాలు
సోమవారం 8, సెప్టెంబర్ 2025





# మీ సేవలు మరువలేనివి శేఖరన్న

## నేడు ప్రథమ వర్ధంతి

**నేటి ఫోకస్ న్యూస్, (తొర్రూర్, మహబూబాబాద్):**

**తొర్రూరు ప్రాంత విద్యార్థి, యువకుల, పేదల తలలో నాలుకై మెదిలి.. జీవితాంతం అణగారిన వర్గాల కోసమే పనిచేసిన అమరుడు జలగం సోమశేఖరన్న మనల్ని వీడి నేటికి ఏడాదవుతోంది. భౌతికంగా ఆయన ఈ ప్రాంతవాసులను వదిలివెళ్లినా ఆయన జ్ఞాపకాలు ఇంకా ప్రజల గుండెల్లో పదిలంగానే ఉన్నాయి. శేఖరన్న రూపును స్మారక స్తూపంలో చూసుకుంటున్న చిన్నవంగర జనం.. ఆయన రాకకోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తూనే ఉన్నారు. తమ ఇంట్లో ఆపద వచ్చినా, బయట సమస్య వచ్చినా అభాగ్యులకు శేఖరన్నే కొండంత అండ. ఈ ఏడాదిలో తొర్రూరు ఏరియాలో శేఖరన్న లేని లోటును తలుచుకుని వేదనకు గురైన కుటుంబాలెన్నో.**

శేఖరన్న విద్యార్థి దశ నుంచే విప్లవ విద్యార్థి ఉద్యమంలో పనిచేస్తూ పీడీఎస్ యూ శేఖర్‌గా ఉమ్మడి వరంగల్ జిల్లాలో పేరు సంపాదించాడు. విప్లవోద్యమాన్ని వదిలి ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్ గా ప్రస్థానం ప్రారంభించాక టీవీ5 శేఖర్‌గా మహబూబాబాద్, తొర్రూరు డివిజన్లలో సుపరిచితుడయ్యాడు. ఆపదలో ఉన్నా అంటే సాయం చేయడానికి ఎంత వరకైనా వెళ్లే శేఖరన్న స్వభావమే ఆయనకు వేలాది మంది ఆత్మీయులను దగ్గర చేసింది. తోడబుట్టకపోయినా ఎంతో మంది తోబుట్టువుల్లాంటి సోదరీ, సోదరులను సంపాదించుకున్నారు. నిరుడు సెప్టెంబర్ 9న అన్నను కడసారి చూసేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాతోపాటు రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 10 వేల మందికిపైగా అంత్యక్రియల్లో పాల్గొనడమే ఇందుకు నిదర్శనం.

1979లో ప్రస్తుత మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగర మండలం చిన్నవంగరలో జలగం ఉప్పలయ్య, లక్ష్మీ దంపతులకు  జన్మించిన సోమశేఖరన్న.. చిన్నప్పటి నుంచే ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకున్నాడు. కొడకండ్లలోని సాంఘిక సంక్షేమ హాస్టల్ లో టెన్త్ చదివే రోజుల్లోనే విద్యార్థులకు భోజనం సరిగ్గా పెట్టని వార్డెన్ అవినీతిపై ప్రశ్నించాడు. అలా పీడీఎస్‌యూ జెండా పట్టిన శేఖరన్న తొర్రూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 1997లో ఇంటర్ చదువుతూ విద్యార్థి నేతగా విద్యారంగ సమస్యలపై పోరాడారు. 1997 నుంచి 2007 వరకు దశాబ్దకాలంపాటు తొర్రూరు పట్టణంలో చదివిన విద్యార్థుల్లో పీడీఎస్ యూ శేఖర్ పేరు తెలియనివారుండరంటే అతిశయోక్తి కాదు. అప్పట్లో స్కూల్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ చదువుల కోసం తొర్రూరుకు వచ్చే విద్యార్థుల సంఖ్య సుమారు 5 వేలపైగా ఉండేది. వారు నెలనెలా బస్ పాస్ తీసుకోవడానికి క్యూలైన్లలో రోజంతా పట్టేది. లేదంటే మరుసటి రోజు రావాల్సిందే. దీంతో పీడీఎస్ యూ నేతగా శేఖరన్న నిర్వహించిన ఆందోళనలతో ప్రత్యేకంగా షెడ్డు వేసి అదనపు బస్ పాస్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. తొర్రూరులో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ కోసం ఉద్యమించి.. అప్పటి ఎమ్మెల్యే దుగ్యాల శ్రీనివాసరావును ఒప్పించి 2005లో డిగ్రీ కాలేజీని సాధించడంలో అన్న పాత్ర మరువలేనిది. స్టూడెంట్ లీడర్‌గా అంచెలంచెలుగా ఎదుగుతూ 2004 నుంచి 2006 వరకు పీడీఎస్ యూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా పని చేశారు. విద్యార్థి నేతగా ఉంటూనే సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ నిర్మాణంలోనూ వివిధ బాధ్యతల్లో పనిచేశారు.


2007లో విద్యార్థి ఉద్యమ బాధ్యతల నుంచి వైదొలగి టీవీ5 చానల్ లో రిపోర్టర్‌గా చేరి జర్నలిస్టుగా తన ప్రస్థానం ప్రారంభించారు. తెలంగాణ జర్నలిస్టు ఫోరం నేతగా తొర్రూరులో జరిగిన తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు. టీయూడబ్ల్యూజే (143) అనుబంధ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు అసోసియేషన్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా పని చేస్తూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సాధనకు కృషి చేశారు. జర్నలిస్టుగా అనేక ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చారు.

తల్లిగారైన జలగం లక్ష్మీని చిన్నవంగర సర్పంచ్‌గా పోటీలో నిలిపి గెలిపించుకున్నాడు. మండలంలో చిన్న గ్రామమైనప్పటికీ, ఆ గ్రామానికి కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాన్ని ఏర్పాటు చేయించాడు. గ్రామానికి మండలంలోనే అత్యధికంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయించడమేగాక అనేక అభివృద్ధి పనులు చేపట్టి ఆదర్శవంతంగా నిలిపాడు. దళిత కుటుంబంలో పుట్టిన తాను అగ్రవర్ణాలతో అన్యోన్యంగా ఉంటూనే.. అగ్ర కుల అహంకారం ప్రదర్శించే వ్యక్తులను ఎదుర్కొన్నాడు. రంగమేదైనా శేఖరన్న ఎప్పుడూ పేదల పక్షానే నిలిచారు. తాను ఎక్కడా ఉన్నా ఎర్రజెండా ఇచ్చిన స్ఫూర్తిని మరవలేదు. ఉద్యమమేదైనా ఉప్పెనలా ముందు నిలిచాడు. తండ్రి ఉప్పలయ్య పెద్దరికాన్ని వారసత్వంగా పుని కిపుచ్చుకుని కుటుంబంలో, బంధువుల్లో, ప్రజల్లో తలలో నాలుకయిన శేఖరన్న అనారోగ్యంతో అర్ధాంతరంగా మనల్ని విడిచిపోవడం చాలా బాధాకరం. శేఖరన్న గుర్తులు ఎప్పుడూ పదిలంగా ఉండేందుకు ఆయన స్మారక చిహ్నాన్ని ఆయన అమితంగా ప్రేమించే చిన్న వంగరలో గ్రామస్తులు, అభిమానులు నిర్మించారు. ఘనంగా స్థూపాన్ని ఆవిష్కరించుకున్నారు. శేఖరన్న లేకున్నా ఆయన ఆశయాలు, ఆలోచనలు పదిలంగా ఉన్నాయి. వాటిని ముందుకు తీసుకెళ్లడమే ఆయన ఆశయాలకు వారసులుగా మనమిచ్చే  నివాళి.

*నేడు టీవీ5 రిపోర్టర్ శేఖరన్న ప్రథమ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి అర్పిస్తున్న ఫోకస్ టీవీ అండ్ నేటి ఫోకస్‌న్యూస్ చైర్మన్, సీఈఓ మహంకాళి.తరుణ్, మరియు స్టేట్ బ్యూరో చీఫ్ మంగళపెల్లి. గోవర్ధన్*

# బీర్పూర్ జెడ్పీటీసీ బీసీలకు దక్కేనా?

## రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ




**నేటి ఫోకస్ న్యూస్, (జగిత్యాల ప్రతినిధి/కందుకూరి రాకేష్)-సెప్టెంబర్8:**

జగిత్యాల జిల్లాలోని బీర్పూర్ మండలంలో జరగబోయే స్థానిక ఎన్నికల రిజర్వేషన్లపై రాజకీయ వర్గాల్లో తీవ్రమైన చర్చ జరుగుతోంది. 2016లో కొత్త మండలంగా ఏర్పడిన బీర్పూర్‌లో, గతంలో జెడ్పీటీసీ స్థానం జనరల్ మహిళకు కేటాయించారు. అయితే, ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించడంతో, ఈసారి బీర్పూర్ జెడ్పీటీసీ బీసీలకు దక్కే అవకాశం ఉందని స్థానికులు భావిస్తున్నారు. ఎందుకంటే మండలంలో అత్యధిక జనాభా బీసీలదే.అయితే, కొన్ని ఊహించని పరిణామాలు చోటు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, ఈ స్థానాన్ని ఎస్సీ వర్గానికి కేటాయించాలని ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

### ఎమ్మెల్యే వ్యూహం..పట్టు సాధించేందుకేనా?

ఈ ఊహాగానాలకు ప్రధాన కారణం, జగిత్యాల నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులే. మాజీ మంత్రి జీవన్ రెడ్డికి సంబంధించిన పాత కాంగ్రెస్ కార్యకర్తలు, బీసీ లేదా జనరల్ వర్గానికి చెందిన వారికి టికెట్ ఇస్తారని ఆశిస్తున్నారు. కానీ ఎమ్మెల్యే మాత్రం, గతంలో బీఆర్ఎస్ అధ్యక్షుడిగా పనిచేసిన ఎస్సీ నేతకు కాంగ్రెస్ టికెట్ ఇచ్చి గెలిపించడం ద్వారా మండలంలో తమ వర్గానికి పట్టు సాధించాలని చూస్తున్నారని అంటున్నారు. జీవన్‌రెడ్డి వర్గంలో ఎస్సీ నేతలు మండల స్థాయిలో అంతగా బలంగా లేకపోవడం ఈ వ్యూహానికి బలం చేకూరుస్తోంది. దీనివల్ల, కాంగ్రెస్ అంటే తామేనని ప్రజలకు చాటిచెప్పడంతో పాటు, ఎన్నికల్లో సునా యాసంగా గెలిచే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే వర్గం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక బీఆర్ఎస్ పార్టీకి కూడా మండలంలో చెప్పుకోదగ్గ ఎస్సీ నేతలు లేక పోవడం ఆశ్చర్యం కలిగించే అంశం.

### బీజేపీ కూడా రేసులో ఉందా?

గతంతో పోలిస్తే, బీజేపీకి కూడా బీర్పూర్ మండలంలో ఓటు శాతం బాగా పెరిగింది. ఒకవేళ జెడ్పీటీసీ స్థానం ఎస్సీ వర్గానికి కేటాయిస్తే, బీజేపీ తరపున పోటీ చేసేందుకు తెలంగాణ ఉద్యమకారుడు, బీజేపీ నేత ఒకరు ఆసక్తిగా ఉన్నారని ఇతను రాష్ట్ర స్థాయిలో మంచి పరిచయాలు ఉన్నాయని సమాచారం. తెలంగాణ ఉద్యమ సమయంలో రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా పోరాడిన ఈ ఉద్యమకారుడు, బీజేపీ  కూడా యువ నేత పేరు పరిశీలిస్తున్నట్టు సమాచారం  తమకు టికెట్ ఇస్తే పోటీకి సిద్ధంగా ఉన్నట్లు తెలియజేసినట్లు తెలుస్తోంది. రానున్న స్థానిక ఎన్నికల్లో అత్యధిక బీసీ జనాభా ఉన్న బీర్పూర్ జెడ్పీటీసీ స్థానాన్ని, వారికి కాకుండా ఎస్సీలకు కేటాయించడం అనేది ఒక సాహసోపేతమైన నిర్ణయం. ఒకవేళ ఈ నిర్ణయం తీసుకుంటే, దానివల్ల రాజకీయంగా ఎలాంటి పరిణామాలు ఉంటాయనేది వేచి చూడాలి. కాంగ్రెస్ పార్టీ ఈ సాహసానికి పాల్పడుతుందా లేదా అనేది భవిష్యత్తులో తేలిపోతుంది.

# తీరితే తిరుపతి.. తీరకపోతే తిరుమలయ్య గుట్ట

### -ప్రతి నెల 7న తిరుమలనాధుని దర్శనానికి శ్రీకారం.



**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:**

తీరితే తిరుపతి.. తీరని వారికి తిరుమలయ్య గుట్ట ఉందంటూ వనపర్తికి చెందిన కొందరు భక్తులు ఆదివారం భారీ సంఖ్యలో స్వామివారి దర్శనం చేసుకున్నారు. ప్రతినెల 7న తిరుపతి వెళ్లి ఎంతోమంది దర్శనం చేసుకుంటుండడం గత కొన్ని ఏళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. అయితే కొందరు వెళ్లాలనుకుంటే దర్శన టికెట్లు దొరకకపోగా మరికొందరికి వీలుకాక పోవడం కుదరడం లేదు. ఈ నేపథ్యంలో వనపర్తికి చెందిన కొందరు మార్నింగ్ వాకర్స్ స్ తో పాటు ప్రతినెల తిరుపతి వెళ్లే భక్తులు కలిసి తిరుపతి వెళ్లలేని వారందరూ 7న తిరుమలయ్య గుట్టకు వెళ్లి తిరుమలనాధుని దర్శనం చేసుకుందామని నిర్ణయించారు. ఇందులో భాగంగానే ఆదివారం అతి భారీ సంఖ్యలో తిరుమలయ్య గుట్టకు వెళ్లి స్వామివారికి కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక మొక్కులు చెల్లించారు. ప్రతినెలా తిరుమలనాథుడి దర్శనం చేసుకుందామని ప్రతిజ్ఞ చేశారు. భక్తుల నిర్ణయాన్ని వనపర్తి ప్రజలు హర్షిస్తూ స్వామివారి ఆశీస్సులు వారికి ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు.

# సీఎంఆర్ అప్పగించని మిల్లర్లపై కఠిన చర్యలు

### -ఆర్ఆర్ యాక్టు క్రింద కేసులు నమోదు చేయాలి.
### -సీఎంఆర్ బియ్యంపై నిర్లక్ష్యం వహించిన గత అధికారులపై చర్యలు.
### -వనపర్తి జిల్లాలో సీఎంఆర్ బకాయిలపై మంత్రి జూపల్లి సమీక్ష.



**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:**

మిల్లర్లు సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) పాత బకాయిలను చెల్లించకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, అవసరమనుకుంటే ఆర్.ఆర్ యాక్ట్ (రెవెన్యూ రికవరీ యాక్టు) కింద ఆయా మిల్లుల యజమానుల నుంచి రికవరీ చేయాలని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. ఆదివారం డా.బీఆర్. అంబేద్కర్ సచివాలయంలో సీఎంఆర్ బకాయిలపై వనపర్తి జిల్లా అధికారులతో మంత్రి జూపల్లి సమీక్ష నిర్వహించారు.



ఈ సందర్భంగా వనపర్తి జిల్లా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎంత వరి ధాన్యం సేకరించారు? జిల్లాల వారీగా మిల్లర్ల నుంచి రావాల్సిన పాత బకాయిలు ?, ధాన్యం సేకరణ? తిరిగి సీఎంఆర్ డెలీవరి ఎంత చేశారు? ఇంకా ఎన్ని బకాయిలు ఉన్నాయి?, బకాయిదారులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

స్టాక్ నిల్వల గురించి అడిగి తెలుసుకున్నారు. సీఎంఆర్ కు సంబంధించి ఇంకా బకాయిలు మిల్లర్ల నుంచి రావాల్సి ఉన్నాయని మంత్రికి డీఎం తెలిపారు. వనపర్తి జిల్లాలో మొత్తం 180 రైస్ మిల్లులు ఉండగా, 168 రా రైస్ మిల్లులు, 12 బాయిల్డ్ రైస్ మిల్లులు ఉన్నాయని, 29 మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు కాగా, 5 మిల్లర్లపై ఆర్ఆర్ యాక్టు క్రింద కేసులు నమోదు చేసినట్లు అధికారులు వివరించారు.

సీఎంఆర్ బకాయిల సేకరణలో ప్రభుత్వం సీరియస్ గా ఉంది. సీఎంఆర్ అప్పగించని మిల్లర్లపై చర్యలు కఠిన చర్యలు తీసుకోవాలి. మిల్లులకు కేటాయించిన ధాన్యం ఆ మిల్లుల్లో లేకుంటే వారిపైనా కేసులు నమోదు చేయాలి. సీఎంఆర్ ఇవ్వని మిల్లర్లపై ఆర్ఆర్ యాక్ట్ కింద ఆస్తులు జప్తునకు చర్యలు తీసుకోవాలి.

మిల్లర్లు అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని మంత్రి జూపల్లి స్పష్టం చేశారు. న్యాయస్థానాల్లో పెండింగ్ లో ఉన్న వ్యాజ్యాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. వాటికి సంబంధించి కౌంటర్ దాఖలు చేశారా అని ఆరా తీశారు.

ప్రభుత్వానికి సీఎంఆర్ ఇవ్వకుండా జాప్యం చేస్తున్న మిల్లర్లపై సీరియస్ యాక్షన్ తీసుకోవాలని, సీఎంఆర్ బకాయిల విషయంలో నిర్లక్ష్యం వహించిన గతంలో పని చేసిన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ సమీక్షలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ కీమ్యా నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్, డీఎస్సీ వెంకటేశ్వర్లు, డీఎస్ వో కాశీ విశ్వనాథం, జిల్లా మెనేజర్ జగన్మోహన్, అసిస్టెంట్ మెనేజర్ బాలు నాయక్, సీఐ కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు





# త్వరలో ప్రత్యక్ష రాజకీయాలలోకి శేఖరన్న సోదరుడు చంద్ర శేఖర్

చంద్ర శేఖర్ మీడియాతో మాట్లాడుతూ..

తన తండ్రి మరియు సోదరుడి ఆశయాల సాధన కోసం త్వరలో తాను కూడా ప్రత్యక్ష రాజకీయాలలోకి వచ్చి ప్రజా సేవ చేస్తానని ఇటీవలే విదేశాలలో స్థిరపడిన చంద్ర శేఖర్ తెలిపాడు. కానీ ఏ పార్టీ లో చేరే విషయం అనేది తన అనుచరులతో చర్చిస్తున్నట్లు, తొందరలోనే పూర్తి వివరాలు తెలియజేస్తానని అన్నారు.

# గజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా కార్యవర్గం ఏకగ్రీవం

### -అధ్యక్షులుగా శ్రీనివాసరెడ్డి (దేవదాసు) ప్రధాన కార్యదర్శిగా బాణం విష్ణు

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:**



తెలంగాణ గజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా కార్యవర్గం ఏకగ్రీవంగా ఎంపికయింది. జిల్లా అధ్యక్షులుగా కొత్తకోట మండలం మిరాశిపల్లి జెడ్పి హైస్కూల్ గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి (దేవదాసు) ప్రధాన కార్యదర్శిగా పెద్దమందడి మండలం వెల్టూరు జడ్పీ హైస్కూల్ గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు బాణం విష్ణు ఎంపికయ్యారు.



అలాగే జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా ఖిల్లా గణపురం మండలం సోలిపూర్ జెడ్పిహై స్కూల్ గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు జయశంకర్, పెద్దగూడెం జిహెచ్ఎం వరలక్ష్మి రంగాపూర్ జిహెచ్ఎం జయరాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ఇటీవల నూతనంగా జిహెచ్ఎంలుగా పదోన్నతి పొందిన బాలస్వామి, సువర్ణ, శ్రీవిద్య, శ్రీనివాసరెడ్డి లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాజా భాను, హేమచంద్రుడు, మురళీకృష్ణ, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.